

చట్టపరంగా న్యాయం చేస్తాం

ప్రజాశక్తి-నెల్లూరు
ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా బాధితుల నుంచి స్వీకరించిన వినతులను పరిశీలించడంతోపాటు శాఖా పరమైన విచారణ చేపట్టి చట్టపరమైన న్యాయం చేస్తామని ఎస్‌పి జి.కృష్ణకాంత్ పేర్కొన్నారు. సోమవారం ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమానికి జిల్లా మొత్తం మీద 103 ఫిర్యాదులను అధికారులు స్వీకరించారని ఎస్‌పి మీడియాకు తెలియజేశారు. బాధితుల నుంచి స్వీకరించిన అర్జీలల్లో కొన్నింటిని మీడియాకు వివరించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్.పి.(అడ్మిన్) సిహెచ్. సౌజన్య, డిటిసి డిఎస్‌పి గిరిధర్, లీగల్ అడ్వయిజర్ శ్రీనివాసులు రెడ్డి, ఎస్‌బి-2 సిఐ బి. శ్రీనివాస రెడ్డి కంప్లైంట్ సెల్ సిబ్బంది పాల్గొన్నారు.

అర్జీలను పరిశీలిస్తున్న ఎస్‌పి

'వేమిరెడ్డి'ది అవమానమా..ఆవేదనా..!

- బొకే కోసం మా..అధికారులకు హెచ్చరిక
- చంద్రబాబుతో దంపతుల భేటీ
- వేమిరెడ్డి సంఘనటపై ఆరా

పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని డిఆర్‌సిలో అవమానించారని, దీంతో ఆగ్రహంతో సభ నుంచి వెళ్లిపోయారని, రాజకీయ, అధికార వర్గాల్లో తీవ్ర చర్చసాగుతోంది. అధికారపార్టీ ఎంపికి ఇలా ఎందుకు జరుగుతుందనే అనుమానం వ్యక్తమవుతోంది. ఇటీవల ఎన్నికల్లో కోట్లాది రూపా యలు పార్టీ కోసం ఖర్చుచేసిన ఆయన కేవలం రెండు వందల రూపాయల బొకే కోసం ఇలా చేశారా? అనే చర్చసాగు తోంది. దీని వెనుక అధికారపార్టీ మం త్రులు, ఎంఎల్‌ఏలు, అధికారులకు హెచ్చరిక ఇచ్చారనే చర్చ సాగుతోంది. మంత్రులు, కలెక్టర్, ఆర్‌డిఓ వెళ్ల ప్రాధేయపడ్డా ఆయన వెళ్లిపోయారు. ఆ సంఘటన జరిగిన తరువాత సోమవారం ఉదయం వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులు సిఎం చంద్రబాబునాయుడుతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు.

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి
వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఇటీవల ఎన్నికల్లో జిల్లాలో అందరినోటా వినిపించిన పేరు. సున్నిత మనస్కుడుగా పేరున్న ఆయన చిన్న చిన్న విషయాలకు పెద్దగా రియాక్ట్ అవుతారని అందరూ చెబుతారు. 2024 ఎన్నికల్లో నెల్లూరు నగర వైసిపి ఎంఎల్‌ఏ అభ్యర్థి ప్రకటన తనకు తెలియకుండా చేశారనే కారణంతో అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితో విభేదించి ఒక్క క్షణంలో వైసిపికి రాజీనామా చేశారు. అటు తరువాత టిడిపిలో చేరిన విధానం తెలిసిందే. ఆ రోజు అందరూ ఈ చిన్న విషయానికి ఇంత పెద్ద నిర్ణయం తీసుకున్నారా? అంటూ ముక్కున వేలేసుకున్నారు. తనకు అవమానం జరిగిందని తెలిస్తే, ఎంతటి నిర్ణయం అలానే ఉంటా యని చెబుతారు. 2024 ఎన్నికల్లో ఆయన టిడిపిలో చేరిన తరువాత ఆపార్టీ అధినేత చంద్రబాబునాయుడు ప్రాధాన్యత ఇచ్చారు. ఉమ్మడి జిల్లాలోని పది స్థానాల్లో అభ్యర్థులకు సాయం చేయా లూ ఆదేశించినట్లు చెబు తారు. ఎన్నికల వరకు విపిఆర్ నివా సం టిడిపి నేతలు, కార్యకర్తలతో కిటకిటలాడింది. పెద్దపెద్ద బడా నేతలంతా ఆయనతో కలిసి వెళ్లారు. ఎన్నికల్లో అనేక మంది ఎంఎల్ఏ అభ్యర్థులకు ఆర్థికంగా కూడా చేయూత అందించారు. ఆయన సతీమణికి కోవూరు ఎంఎల్‌ఏ టికెట్ దక్కింది కూడా. గత ఎన్నికల సమయంలో రాష్ట్ర రాజకీయాల్లోనూ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పేరు మారుమో గింది. భారీగా ఖర్చుపెట్టినట్లు సమాచారం. పార్టీ వ్యవహారాలన్నీ వేమిరెడ్డి కార్యాలయం నుంచే ఎక్కువ సాగాయి.

మరి ఎన్నికల తరువాత..!

2024 ఎన్నికల్లో టిడిపి చరిత్ర ఎరుగని విజయం సొంతం చేసు కుంది. ఇందులో వేమిరెడ్డి పా త్ర ఎవరూ కాదన లేరు. కేంద్ర మంత్రి వర్గంలో వేమి రెడ్డి ప్రభాకర్‌రెడ్డికి స్థానం దక్కు తుందని ప్రచారం సాగింది. చివరికి మరొకరికి దక్కిందని చెబుతారు. రాష్ట్ర మంత్రి వర్గంలో ఆయన సతీ మణి వేమిరెడ్డి ప్రశాం తిరెడ్డి ఉంటారని ప్రచా రం సాగింది. మంత్రివర్గ విస్తరణ సమయంలో పెద్ద ఎత్తున ఇంటి ముందు ఫ్లెక్సీలు ఏర్పాట్లు చేసు కొని తొలగించారు. ప్రభుత్వం ఏర్పా టు తరువాత ఎంపికి ప్రాధాన్యత లేకు ండా పోయిందనే ప్రచారం ఉంది. అన్ని నియోజక వర్గాల్లో ఎంఎల్ఏలే బాస్‌లు. వారి చెప్పిందే వేదం. అది కార బదిలీల నుంచి ప్రతి అంశమూ ఎంఎల్ఏలదే. ఎన్నికల తరువాత ఆయన పూర్తిగా ఇక్కడ రాజకీయాలను పక్కన పెట్టి వ్యాపారంపై దృష్టిపెట్టినట్లు తెలిసింది. అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు అనేక విషయాల్లో ఎంపికి ప్రాధాన్యత ఇవ్వడం లేదనే ఆవేదనతో ఉన్నట్లు సమా చారం. ఈ నేపథ్యంలో ఆది వారం డిఆర్‌సి సమావేశంలో ఈసం ఘటన చోటుచేసుకుంది. అధికార పార్టీ ఎంపిని ఏ అధికారి అవమాన పరిచే సాహసం చేయరు. కేవలం అనుకోకుండా జరిగిన పొరపాటుగానే అందరూ భావిస్తున్నారు. వేమిరెడ్డి మనస్సులోని ఆవేదన, ప్రస్తుత సంఘటనతో ఒక్కసారి ఆగ్రహం వ్యక్తం చేశారని తెలుస్తోంది. ఒక్కసా రిగా మంత్రులు, ఎంఎల్ఏలు, అధి కారులు అందరూ ఖంగుతున్నారు. రెండు వందల రూపాయల బొకే కోసం ఆయన ఇలా చేస్తారా ? దీని వెనుక బలమైన కారణం ఏమిటనే ఆరా తీస్తున్నారు. ఈ సంఘటనతో అందరికీ ఆయన హెచ్చరిక చేశారని కొందరు అంటు న్నారు. టిడిపిలో కొందరు నేతలు ఎన్నికల సమయంలో వచ్చిన ఆయ నకు సరైన గుర్తింపు లేదని ఆవేదన పడితే, పార్టీని నమ్ముకున్న మాకు జరిగిన అవమానం పరిస్థితి ఏమిటని చెవులు కొరుక్కుం టున్నారు. సిఎంతో భేటితో వేమిరెడ్డి ప్రబాకర్‌రెడ్డి సమస్య సర్దుమణిగిందని తెలిసింది. మరోసారి ఎంపి విషయంలో అటు మంత్రులు, ఎంఎల్ ఎలు, అధికారులు జాగ్రత్తగా ఉంటారని తెలుస్తోంది. ప్రత్యక్ష రాజకీ యాలకు కొత్తగా వచ్చిన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పూర్తి రాజకీయ వాతావరణం వంటబట్టినట్లు కనిపిం చడం లేదని చెవులు కొరుక్కుం టున్నారు.

సిఎం చంద్రబాబును కలిసిన వేమిరెడ్డి దంపతులు

మాట్లాడుతున్న శాస్త్రవేత్త ప్రసాద్ బాబు

అనుమతి మేరకే పొగాకు సాగుచేయాలి

ప్రజాశక్తి-కందుకూరు
: కందుకూరు- 26 పొగాకు బోర్డు వేలం కేంద్రం ప్రాంతీయ అధికార కార్యాలయం ,కందుకూరు 1, 2 వేలం కేంద్రాల రైతులకు పొగాకు ఉత్పత్తుల పంట నియంత్రణ, ప్రత్యామ్నాయ పంటలు, పంట మార్పిడి, పంటలు సాగుపై అవగాహన సదస్సు సోమవారం జరిగింది. ఈ కార్యక్రమం లో డా ప్రసాద్ బాబు ,కందుకూరు కెవికె హెడ్ అండ్ సీనియర్ శాస్త్రవేత్త వి రాము, కందుకూరు - 1,2 వేలం కేంద్రాల నిర్వహణ అధికారులు ఎం కిరణ్,బి చంద్ర శేఖర్, ప్రాంతీయ కార్యాలయం వేలం నిర్వహణ అధికారి జె తులసి, పొగాకు బోర్డు సిబ్బంది పాల్గొన్నారు. ప్రసాద్ బాబు మాట్లాడుతూ పొగాకు పంటకు ప్రత్యామ్నాయ పంటలు అయిన మిరప, పత్తి, శనగ, కంది, మినుము, పెసర,మొక్క జొన్న, ప్రొద్దు తిరుగుడు, నువ్వులు, జనుము, మొదలగు పంటల నూతన వంగడాల వివరములు యాజమాన్య పద్ధతులు, దిగుబడి, సరాసరి ధర, మొదలగు సాగు మెలుకువలు, వివరించి లాభదాయకమైన ప్రత్యామ్నాయ పంటలు వైపు అడుగులు వేయాలని రైతులకి సూచించారు. వి రాము మాట్లాడుతూ సిడిపి ప్రోగ్రాం కింద రాష్ట్ర ప్రభుత్వం పొగాకు పంటకు ప్రత్యామ్నాయ మైన లాభదాయకమైన పంటల సాగు చర్యల గురించి , వ్యవసాయ విభాగం వారు సరప చేస్తున్న వివిధ ఉత్పత్తులైన ట్రైకోడర్మ విరిడే, జనుము విత్తనములు, మొదలగు వాటి గురించి వివరించారు. జె. తులసి మాట్లడుతూ పొగాకు పండించు ప్రధాన దేశములైన చైనా, బ్రెజిల్, జింబాబ్వే, మొదలగు దేశముల పొగాకు ఉత్పత్తి నిలువలు డిమాండ్ అండ్ సప్లై , ఎగుమతులు, పంట నియంత్రణ ఆవశ్యకతపై రైతులకు పలు సూచనలు చేశారు. వేలం నిర్వహణ అధికారులు అయిన కిరణ్, చంద్ర శేఖర్ మాట్లాడుతూ పొగాకు బోర్డు ప్రొడక్షన్ పాలసీ గురించి చర్చించి, పొగాకు బోర్డు అనుమతించిన మేరకే సాగు చేయాలన్నారు. పొగాకు భూమి బ్యారెన్ లు అధిక అద్దె లకు తీసుకోవద్దని సూచించారు.

రిజిస్ట్రేషన్ పట్టాలు పంపిణీ చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ డిమాండ్

ప్రజాశక్తి-నెల్లూరు:పట్టణ ప్రాంతంలో భూ సమస్యల పరిష్కారం కోసం జిల్లా అధికార యంత్రా ంగం రెవెన్యూ సదస్సులు నిర్వహిం చాలని, పలు ప్రాంతాలలో సమస్యలు కుప్పలు కుప్పలుగా పేర్కొనిపోయి ఉన్నాయని, ముఖ్యంగా వెంకటేశ్వరపురం ప్రాంతంలోని గాంధీగిరిజన కాలనీ, జనార్థన్‌రెడ్డి కాలనీ, భగత్‌సింగ్ కాలనీ, తదితర ప్రాంతాలల్లో స్థలాలకు రిజిస్ట్రేషన్ పట్టాలు పంపిణీ చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ డిమాండ్ చేశారు. నగర నియోజకవర్గ పరిధిలోని 53వ డివిజన్ సిపిఎం శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 8 గంటల నుండి వెంకటేశ్వరపురం సెంటర్లో స్థానిక ప్రజలందరూ కలిసి రిజిస్ట్రేషన్ పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సామూహిక నిరసన ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ధర్నా అనంతరం 53వ డివిజన్ సచివాలయం అడ్మిన్ సెక్రటరీ చైతన్యకు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం నెల్లూరు జిల్లా కార్యదర్శి మూలం రమేష్, నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, నగర కార్యదర్శి వర్గ సభ్యులు జి నాగేశ్వరరావు ప్రసంగించారు. నగర నియోజకవర్గ పరిధిలోని 53 , 54 డివిజన్లో గల వెంకటేశ్వరపురం,గాంధీ గిరిజన కాలనీ, జనార్దన్ రెడ్డి కాలనీ,భగత్ సింగ్ కాలనీ మొదలైన ప్రాంతాలలో ఇళ్లకు స్థలాలకు రిజిస్ట్రేషన్ సౌకర్యం కలిగిన పట్టాలు లేవన్నారు. ఇదే పరిస్థితి నగర నియోజకవర్గ పరిధిలో పేద మధ్యతరగతి ప్రజలు నివసించే 70 శాతం ప్రాంతాలకు నెలకొని ఉందన్నారు. నగరపాలక సంస్థకు ఇంటి పన్నులు, భవన నిర్మాణ అనుమతులకు ఫీజులు చలానాలు కోట్ల రూపాయల ప్రజలు చెల్లిస్తున్నారన్నారు. రిజిస్ట్రేషన్ పట్టాలు లేకపోవడం విచారకర మన్నారు. ప్రజలకు రిజిస్ట్రేషన్ పట్టాలు ఇచ్చేం దుకు ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయాల్సిన అవసరం లేదన్నారు. కలెక్టర్ ప్రభుత్వానికి నివేదికను సమర్పించి సమస్య పరిష్కారానికి తగు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో వివిధ రూపాల్లో దశలవారీ ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు పి సూర్యనారాయణ,షేక్ మస్తాన్‌బీ, స్థానిక శాఖ కార్యదర్శి గడ్డం శ్రీనివాసులు రెడ్డి, సిపిఎం నగర కమిటీ సభ్యులు మూలం ప్రసాద్, బీపీ నరసింహ, కత్తి పద్మ, షేక్ జాఫర్ అలీ, అల్లంపాటి శ్రీనివాసులు, ఏమేలు, చిరంజీవి, కె.వి.రమణారెడ్డి,షేక్ ఫయాజ్ శాఖా కార్యదర్శులు మట్టిపాటి శ్రీనివాసులు, షేక్ కరిముల్లా స్థానిక నాయకులు కే రవి, మణి, ఐ. బయ్యపు రెడ్డి,భార్గవి,షకీలా, లక్ష్మీ,ఖాదరమ్మ, ధనమ్మ, నక్క వేంకటేశ్వర్లు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్

సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి-కందుకూరు: కందుకూరు పురపాలక సంఘ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా పిర్యాధుల, డయల్ యువర్ కమిషనరు కార్యక్రమం ద్వారా 9 అర్జీలు వచ్చినట్లు మున్సిపల్ కమిషనరు కె. అనూష తెలిపారు. ఈ కార్యక్రమంలో అందరు సెక్షన్ హెడ్స్ పాల్గొన్నారు. కందుకూరు పురపాలక సంఘ కార్యాలయం కమిషనర్ ఛాంబర్‌లో జరిగే ప్రజా పిర్యాధుల కార్యక్రమాన్ని సద్విని యోగం చేసుకో వాలని మున్సిపల్ కమిషనరు కె. అనూష పట్టణ ప్రజలను కోరారు.

అర్జీలు పరిశీలిస్తున్న కమిషనర్ అనూష

అనిల్‌కు ఎంఎల్‌సి పరామర్శ

ప్రజాశక్తి-నెల్లూరు +ఆఫ్కాఫ్ రాష్ట్ర మాజీ చైర్మన్ కొండూరు అనిల్ బాబును ఎంఎల్‌సి పి.చంద్రశేఖర్‌రెడ్డి పరామర్శించారు. సోమవారం అల్లూరు మండలం, ఇసుకపల్లి పంచాయతీ, సంభునివారి పల్లె లోని కొండూరు అనిల్ బాబు నివాసానికి వెళ్లి ఆయనతో మాట్లాడారు. ఇటీవల ఆయన తండ్రి కొండూరు గోవిందయ్య మరణించారు. విషయం తెలుసుకున్న ఆయన పరామర్శించి ధైర్యం చెప్పారు. గోవిందయ్య చిత్రపటానికి నివాళి అర్పిం చారు. ఆయనతోపాటు కార్పొరేటర్ ఊటుకూరు నాగార్జున ఉన్నారు.

విఆర్‌ఎలకు పే స్కేలు అమలు చేయాలి

ప్రజాశక్తి-నెల్లూరు:రాష్ట్ర ప్రభుత్వం విఆర్‌ఎలకు పే స్కేలు అమలు చేయాలని, అర్హులైన వారికి ప్రమోషన్స్ కల్పించాలని, నామినే లుగా పని చేస్తున్న వారిని విఆర్ ఎలుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ, గ్రామ రెవెన్యూ సహాయ కుల సంఘం (విఆర్‌ఏ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు కె. పెంచల నరసయ్య, జిల్లా అధ్యక్షులు భాస్కర్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు చేరవేస్తూ, గ్రామాలలో ఏ సమస్య వచ్చినా విఆర్‌ఎ కీలకంగా పనిచేస్తున్నారన్నారు. అటువంటి విఆర్‌ఎలకు గత ఏడు సంవత్సరాల నుండి విఆర్‌ఎలకు ఒక్క రూపాయి వేతనం కూడా పెరగలేదన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు రద్దు చేశారన్నారు. అర్హులైన వారికి ప్రమోషన్లు ఇవ్వకపోగా, నామినీలుగా పనిచేస్తున్న వారసులను విఆర్‌ఎలుగా గుర్తించకపోవడం దారుణ మన్నారు. యువ గళం పాదయాత్రలో నారా లోకేష్ అధికారంలోకి వచ్చిన వెంటనే విఆర్‌ఎల సమస్యలు పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. విఆర్‌ఎలుగా పని చేస్తున్న వారిలో అత్యధికులు దళితులు ఇతర బలహీన వర్గాలకు చెందిన వారు. చాలీచాలని వేతనాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి విఆర్‌ఎల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ఓబులేసు, హనుమంతు, పెంచలయ్య, బాషా, వెంకటేష్, కనకాద్రి తదితరులు పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న నాయకులు

హెల్ప్‌లైన్ సేవలు సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-నెల్లూరు:నగర పాలక సంస్థ పరిధిలోని స్థానిక సమస్యలను కమాండ్ కంట్రోల్ విభాగంలో ఏర్పాటు చేసిన హెల్ప్ లైన్ కి ఫోన్ ద్వారా తెలియజేస్తే తక్షణమే స్పందించి ఫిర్యాదును పరిష్కరించేందుకు కృషి చేస్తామని కమిషనర్ సూర్యతేజ తెలిపారు. సోమవారం రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికను నగర పాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ విభాగం సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కమిషనర్ సూర్యతేజ పాల్గొని అర్జీదారుల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వివిధ అంశాలపై ప్రజల నుంచి అందుకున్న ఫిర్యాదులు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం అందించాలని, వాటన్నింటికీ నిర్ణీత సమయంలోగా పరిష్కారం అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం అందుకున్న వినతులు పునరావృతం కాకుండా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో శాశ్వత పరిష్కారం అందించాలని అదనపు కమిషనర్ సంబంధిత సెక్షన్ అధికారులకు సూచించారు.

మాట్లాడుతున్న కమిషనర్

ఆహారం పంపిణీ

ప్రజాశక్తి-కందుకూరు:ఐ.ఎఫ్.సి ఫౌండేషన్ కందుకూరు వారి ఆధ్వర్యంలో సోమవారం దాత సహాయంతో పేదవారికోసం కందుకూరులో వృద్ధులను,పిల్లలను గుర్తించి వారికి ఆహారం , పండ్లు పంపిణీ చేయడం జరిగింది.ప్రతి ఒక్కరూ తమ సామాజిక బాధ్యతగా పేదవారికి సహాయం అందిస్తే సమాజానికి ఎంతో మేలు జరుగుతుందని ఫౌండేషన్ సెక్రెటరీ షంషేర్ అన్నారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ సాజిద్,ట్రెజరర్ హఫీజ్,ఇన్‌ఛార్జ్ అయూబ్ ఖాన్ పఠాన్, షంషుద్దీన్ పాల్గొన్నారు.



డివైఎఫ్ఐ ఆవిర్భావ వేడుకలు

ప్రజాశక్తి-నెల్లూరు:రూరల్ 25డివిజన్ బుజబుజ నెల్లూరులో డివైఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమం జరిగింది. భగత్ సింగ్ కాలనీ. డివైఎఫ్ఐ జెండాను తాటిపర్తి శ్రీనివాసులు ఆవిష్కరించారు.శివాజీ కాలనీ డివైఎఫ్ఐ జెండాను ఉయ్యాల శ్రీనివాసులు, మిట్టమీద సెంటర్. డివైఎఫ్ఐ జెండాను ఇంగిలాల విజయ్ కుమార్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి డివైఎఫ్ఐ జిల్లా మాజీ నాయకులు కొండా ప్రసాద్ మాట్లాడుతూ డివైఎఫ్ఐ 1980 సంవత్సరం పంజాబ్ రాష్ట్రం లూధియానగరంలో ఆవిర్భవించినదని తెలిపారు.కార్యక్రమంలో శాఖ కార్యదర్శి కష్ణమూర్తి,శంకర్,ఎన్ వికాస్, రాగి శ్రీనివాసులు, ఎ.తిరుపాలు తదితరులు పాల్గొన్నారు

జెండాను ఆవిష్కరిస్తున్న దృశ్యం

సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-నెల్లూరు:ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చే అర్జీలను వ్యక్తిగత శ్రద్ధ పెట్టి పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ ఒ.ఆనంద్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జాయింట్ కలెక్టర్, ఇతర అధికారులతో కలిసి నిర్వహించి పలు సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రజల నుంచి వచ్చిన సమస్యలను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతనిస్తున్న దష్ట్యా అధికారులు ఆ దిశగా పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ముఖ్యంగా రీఓపెన్ అవుతున్నటువంటి కేసులలో రెవిన్యూ అధికారులు అత్యంత జాగ్రత్తగా పరిష్కారం చూపాలన్నారు. పరిష్కారం చూపకుండానే ఆయా అర్జీలను మూసి వేయకూడదన్నారు.క్షేత్రస్థాయిలో పర్యటించి అర్జీల పరిష్కరించడానికి తగు చర్యలు తీసుకోవాలన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్

మొబైల్ ఫోన్స్..లాప్‌టాప్‌ల పంపిణీ

జిల్లాలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే బధిర, అంధ విద్యార్థిని విద్యార్థులకు మొత్తం 3,95,000 రూపాయల విలువ కలిగిన 10 మొబైల్ ఫోన్లు, 7 లాప్ టాప్ లను విభిన్న ప్రతిభా వంతుల శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ అందజేశారు. అనంతరం బేటీ బచావో బేటీ పడావో టోల్ ఫ్రీ నంబర్ల వాల్ పోస్టర్ ను ఆవిష్కరించారు. జిల్లా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం అందజేస్తున్న వివిధ రకాల సేవలకు సంబంధించిన ఉచిత అత్యవసర హెల్ప్ లైన్ నంబర్ల వాల్ పోస్టర్ ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ వాల్ పోస్టర్ ను జిల్లాలోని ప్రతి అంగన్వాడీ సెంటర్లలో విధిగా ప్రదర్శించాలన్నారు. కార్యక్రమంలో డిఆర్ఓ ఉదయభాస్కర్ , జెడ్‌పి ఇన్‌ఛార్జి సిఇఒ మోహన్ రావు , జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్ రెడ్డి , డి.ఆర్.డి.ఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ నాగరాజ కుమారి, డ్వామా పీడీ గంగా భవాని, డిటిసి చందర్, ఐసిడిఎస్ పిడి హేనా సుజన్, హౌసింగ్ పీడీ వేణుగోపాల్, డి సి పి ఓ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సుందరయ్య నగర్ సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-కందుకూరు: కందుకూరు సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ కె అనూషకి సోమవారం వినతి పత్రం అందజేశారు. పట్టణం ఆరో వార్డు సుందరయ్య నగర్‌లోని సమస్యలు పరిష్కరించాలని కందుకూరు మున్సిపల్ కమిషనర్‌తో సిపిఎం పట్టణ కార్యదర్శి ఎస్‌ఏ గౌస్ మాట్లాడుతూ కందుకూరు పట్టణానికి సమ్మర్ స్టోరేజ్ ఏర్పాటు చేయడం కోసం ఆరోజు అక్కడ నివాసం ఉంటున్న పేదల ఇల్లు తొలగించ్చి పక్కనే ఇళ్ల స్థలాలు ఇవ్వటం జరిగింది. రామతీర్థం నుంచి కందుకూరు పట్టణానికి పరిసర ప్రాంతాలకు పైప్లైన్ ద్వారా మంచినీటి వసతి కల్పించారు. సమ్మర్ స్టోరేజీ ఆనుకొని పక్కనే ఉన్న సుందరయ్య నగర్, లింబిని వనానికి మంచినీళ్ల పైప్ లైన్ గాని కుళాయి కనెక్షన్ గాని కల్పించలేదు. సమ్మర్ స్టోరేజీ నిర్మాణం కోసం నివాసం ఉంటున్న ఇళ్లను తొలగించి పక్కనే ఇల్లు నిర్మించుకోమని స్థలం చూపించారు. ఆ సందర్భంలో ప్రజా ప్రతినిధులు అధికారులు మాట్లాడుతూ సుందరయ్య నగర్ కాలనీ మోడల్ కాలనీ చేస్తామన్నారు.కార్యక్రమంలో సిపిఎం పట్టణ నాయకులు టి వెంకట్రావు, ఎస్.కె మల్లిక, ఎం పద్మ, ఏం రాయుడు పాల్గొన్నారు.



వినతి పత్రం సమర్పిస్తున్న సిపిఎం నాయకులు

15న ఘనంగా కార్తీక దీపోత్సవం

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి
నెల్లూరు నగరంలో ఈనెల 15 ఘనంగా కార్తీకదీపోత్సవ కార్యక్రమం కన్నుల పండుగగా నిర్వహిస్తున్నట్లు నెల్లూరు రూరల్ ఎంఎల్‌ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. సోమ వారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమాఎ ేశంలో ఆయన మాట్లాడారు. కాశి ఘాట్‌ను తలపించే విధంగా నగరంలోని గణేష్ ఘాట్ తీర్చుదిద్దు తామని, తమ శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామని తెలిపారు. సింహపురి కార్తీక దీపోత్సవ సమితి ఆధ్వర్యంలో రాజకీయాలకు అతీతంగా, పార్టీలకు అతీతంగా కార్తీక దీపోత్సవ కార్యక్రమం జరుగుతుం దన్నారు. 15 ఉదయం నుంచే వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామని, సాయంత్రం 5 గంటలకు మహిళలతో శోభాయాత్ర, 6 గంటలకు 108 తెప్పలతో శివ ఆకృతి కార్యక్రమం ఏర్పాటుచేస్తున్నామన్నారు. ఈ కార్తీక దీపోత్సవంలో నెల్లూరు జిల్లా ప్రజలందరూ పాల్గొని , . హరహరమహాదేవ్ శంభోశంకర నినాదాలతో గణేష్ ఘాట్ మారుమోగుతుందన్నారు. హరిద్వార్ నుంచి ఐదుగురు సాధువులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు.



మాట్లాడుతున్న మాజీ ఎంఎల్‌సి విటపు బాలసుబ్రమణ్యం

డిమాండ్ల సాధనకు సంయమనం పాటించాలి

ప్రజాశక్తి-నెల్లూరు :రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు తమ న్యాయమైన సమస్యల సాధనకు సంయమనం పాటించాల్సిన అవసరం ఉందని మాజీ ఎంఎల్‌సి విటపు బాలసుబ్రహ్మణ్యం అన్నారు. సోమవారం స్థానిక భక్తవత్సలనగర్ ప్రాంతంలోని పెన్షనర్ల సంక్షేమ భవన్‌లో నిర్వహించిన రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిధిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్షనర్లు అందరూ సంఘంలో సభ్యులుగా చేరి తమ సమస్యల పరిష్కారానికి పోరాటం చేసి సాధించుకోవడం సులభతరం అవుతుందన్నారు. ఉపాధ్యాయ ఉద్యమ నేత బాబురెడ్డి మాట్లాడుతూ పెన్షనర్లు అందరూ సంఘటిత ంగా ఉండాలని పిలుపు నిచ్చారు. అనంతరం పెన్షనర్ల సమస్యలు,పరిష్కారానికి చేపట్టాల్సిన పోరాటాలు తదితర అంశాలపై సుదీర్ఘమైన చర్చలు నిర్వహించారు. చివరగా డాక్టరు అగర్వాల్ కంటి వైద్యశాల వైద్యబృందం చే పెన్షనర్లకు ఉచితంగా కంటి వైద్యపరీక్షలు నిర్వహిం చారు.కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు వీరేంద్రనాథ్, గోపాల్, ఖాశీం, ఎన్.శ్రీనాద్, జె.హజరత్తయ్య, ప్రధాన కార్యదర్శి ఎస్‌పివిఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

రామాయపట్నం పోర్టు పరిధిలోకి

సాలిపేట బిసి కాలనీ చేర్చాలి

ప్రజాశక్తి-నెల్లూరు
రామాయపట్నం పోర్టు పరిధిలోకి సాలిపేట బీసీ కాలనీ చేర్చి వారికి 2013 చట్టం ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీని అమలు చేయాలని సిఐటియు, పోర్టు నిర్వాసితుల సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో సిఐటియు, పోర్టు నిర్వాసితుల సంక్షేమ సంఘం నాయకులు కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కార్యాలయం వద్ద సాలిపేట గ్రామస్తులు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో సిఐటియు జిల్లా కార్యదర్శి గోగుల శ్రీనివాసులు, అల్లాడి గోపాల్, కోలగట్ల సురేష్, జి వెంకటేశ్వర్లు, వీరికి సంఘీభావం తెలుపుతూ ప్రసంగించారు. పోర్టు యాజమాన్యానికి లాభాలు తెచ్చి పెడుతూ, పోర్టు కోసం త్యాగం చేసిన నిర్వాసితులకు మాత్రం మొండి చెయ్యి చూపిస్తుందని నాయకులు చేశారు. సాలిపేట పంచాయతీ పరిధిలో కర్లపాలెం, సాలిపేట ఎస్టి బీసీ కాలనీలు ఉన్నాయని, కర్లపాలెం, సాలిపేట ఎస్టి కాలనీలను, పోర్టు పరిధిలో చేర్చి వారికి ప్యాకేజీ అమలు చేశారని నాయకులు గుర్తు చేశారు. మధ్యలో ఉన్న సాలిపేట బీసీ కాలనీ సర్వే చేసి పరిహారం ఇవ్వకుండా వదిలివేయడం సరైన పద్ధతి కాదని ప్రభుత్వ విధానాన్ని నాయకులు దుయ్యబట్టారు. పోరాటం ద్వారా తమ హక్కులు సాధించుకోవాలని వారు నిర్వాసితులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సాలిపేట గ్రామస్తులు మాట్లాడుతూ, సాలిపేటలో ఉన్న సాగు భూమి మొత్తాన్ని పరిశ్రమల కోసం తీసుకుంటున్నారు. రైల్వే ట్రాక్ కోసం మరికొంత భూమిని తీసుకున్నారు. ఈ ట్రాక్ వలన 60 ఎకరాలు పట్టాభూమికి నీరు ప్రవహించే సుబ్బయ్య గుంటను కూర్చున్న కారణంగా, పంటలు పండక రైతులు ఈ ఏడాది నష్టపోయమని, ఇట్టి పరిస్థితుల్లో తాము ఏ విధంగా జీవనం సాగించాలో ఆలోచన చేయాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. రైల్వే ట్రాక్ నిర్మాణానికి భారీ వాహనాలు ఉపయోగించడం వలన, స్కూలుకు వెళ్లే విద్యార్థులకు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాపోయారు. మా భూములు తీసుకోవడంతో కూలీలుగా మారిపోయామని, పనుల కోసం ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్ళాల్సిన దుస్థితి తమకు కలుగుతుందన్నారు. ఎన్ని ఇబ్బందులతో మేము సతమతమయ్యే కన్నా, మా భూములతో పాటు మా ఇల్లు కూడా తీసుకొని మాకు న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరారు. సాలిపేట గ్రామస్తుల సమస్యలపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్ కందుకూరు సబ్ కలెక్టర్‌చేత విచారణ చేయించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సాలిపేట గ్రామస్తులు, అట్లా కోటయ్య, కొమరిక కోటయ్య, కొక్కిలిగడ్డ సుబ్రహ్మణ్యం, సన్నె బోయిన శ్రీరామమూర్తి కవర్తపు వాసుదేవరావు, బండారు రామారావు, సన్న బోయిన మాలకొండయ్య, చల్లా వేణు స్వామి, సుధాకర్, రామ్మోహన్ రవి రమేష్ కృష్ణ పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న నాయకులు

డయేరియా ప్రబలకుండా జాగ్రత్తలు

ప్రజాశక్తి-నెల్లూరు:కలుషిత తాగునీటితో ప్రబలే డయేరియా పట్ల ప్రజలందరికీ అవగాహన పెంచి నగరపాలక సంస్థ కమాండ్ కంట్రోల్ హెల్ప్ లైన్ సహాయం తీసుకునేలా చర్యలు చేపట్టాలని కమిషనర్ సూర్యతేజ తెలిపారు. నగర పాలక సంస్థ వివిధ విభాగాల అధికారులు, సచివాలయం కార్యదర్శులతో కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో "డయేరియా నివారణ - తాగునీటి నాణ్యత" అంశంపై సమీక్షా సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ కలుషిత తాగునీటి ద్వారా వ్యాప్తి చెందే వ్యాధులైన డయేరియా, దోమల ద్వారా వ్యాపించే మలేరియా, టైఫాయిడ్, చికెన్ గున్యా, డెంగీ, ఇతర వ్యాధులను అరికట్టడానికి ఎప్పటి కప్పుడు అవసరమైన చర్యలను ప్రణాళికాబ ద్ధంగా చేపట్టాలని సూచించారు. నగర పాలక సంస్థ పరిధిలో అన్ని డివిజనుల్లో ఇండ్ల చుట్టూ, ప్రాంగణాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకునే విధంగా గృహాల యజమానులకు అవగాహన కల్పించాలని, దీనికోసం ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు..ఈ సమీక్షలో అదనపు కమీషనర్ నందన్, యస్. ఈ.రామ్ మోహన్,ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ చైతన్య, అర్బన్ ఫామిలీ వెల్ఫేర్ అధికారి జిజియా బాయి, ఇంజినీరింగ్ విభాగం అధికారులు, శానిటేషన్ విభాగం అధికారులు, సచివాలయం అమెనిటీస్, శానిటేషన్ కార్యదర్శులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కమిషనర్ సూర్యతేజ

రోడ్డు సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-జలదంకి : మండల కేంద్రంలో నెలకొన్న రోడ్డు సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జలదంకి గ్రామ పంచాయతీ యాదవపాలెం వద్ద ఉన్న రోడ్డు గురించి, హాస్టల్ బజారు గురించి యాదవపాలెం బజారు మధ్యలో 150 మీటర్ల పొడవు రోడ్డు పల్లమై ఒకటిన్నర అడుగు లోతుగుంత ఉన్నందున పరిసర ప్రాంతంలో మురికి నీరు దుర్గంధం వెదజల్లుతుందన్నారు. ప్రతినిత్యం వీధిన జెడ్‌పి హెచ్ స్కూలుకి విద్యార్థిని విద్యార్థులు రోజుకు నాలుగు సార్లు ఆ మురికి నీటిలో నడవాల్సి వస్తుందని, అదేవిధంగా ప్రయాణికులు ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది, ఆ ప్రాంత ప్రజలు ప్రతినిత్యం నడవాల్సి వస్తుందన్నారు. ప్రజలకు అంటూ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది కాబట్టి తమరు సంబంధిత అధికారులతో పరిశీలించి అక్కడ 150 మీటర్ల పొడవున ఒకటిన్నర అడుగుల ఎత్తు రోడ్డును ఏర్పాటు చేయించాలన్నారు. అదేవిధంగా ప్రభుత్వ వసతి గృహం హాస్టల్‌కు పోయే రోడ్డులో 100 అడుగుల దూరం నీరు ఇతర వ్యర్థాలు నిలిచిపోయి హాస్టల్ విద్యార్థులు ఊరికి నీటిలో నడవాల్సిన పరిస్థితి ఏర్పడి ఉందని, కావున వెంటనే పై సమస్యలను పరిష్కరించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో సిపిఎం రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రావి మాల్యాద్రి, రైతు సంఘం గ్రామ కార్యదర్శి మేలంగి అంతోని బాబు పాల్గొన్నారు.

ఎంఎల్ఎ క్రిష్ణారెడ్డికి సన్మానం

ప్రజాశక్తి-కావలి : కావలి జవహర్ భారతి కళాశాల పూర్వ విద్యార్థి ఎంఎల్ఎ కావ్య క్రిష్ణారెడ్డిని సోమవారం కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమానికి వచ్చిన ఎంఎల్ఎ కావ్య క్రిష్ణారెడ్డికి ఘన స్వాగతం పలికారు. ఎంఎల్ఎ మాట్లాడుతూ జవహర్ భారతి కళాశాలలో తను చదువుకునేప్పుడు ఎదుర్కొన్న ఆర్థికఇబ్బందులు, కష్టాలను విద్యార్థులకు వివరించారు. అప్పుడు కష్టాలు ఎదుర్కొని కష్టపడి చదువుకొని ఉన్నత స్థాయికి వచ్చాను కాబట్టే ఈరోజు ఈ సన్మానం తనకు దక్కిందన్నారు. ప్రతి విద్యార్థి కష్టంతో కాకుండా ఇష్టంతో చదువుకోవాలని అప్పుడే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని ఆయన తెలిపారు. కార్యక్రమానికి కళాశాల కరెస్పాండెంట్ వి.సుధాకరరెడ్డి అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సుబ్రహ్మణ్యం నాయుడు, ఫైనాన్స్ డైరెక్టర్ ఆర్.మాల్యాద్రి పాల్గొన్నారు.

వాకర్స్ క్లబ్ ప్రారంభం

ప్రజాశక్తి-నెల్లూరు : నెల్లూరు నగరంలో మరో వాకర్స్ క్లబ్ అడుగులు వేసింది. పొదలకూరు రోడ్డులోని హైస్కూల్లో వెల్ వాకర్స్ వింగ్ అనే పేరుతో భోగవరపు శ్రీమన్నారాయణ అధ్యక్షులుగా వాకర్స్ క్లబ్ ఏర్పాటైంది. డిస్ట్రిక్ట్ 203 వాకర్స్ ఇంటర్నేషనల్ క్లబ్ గవర్నర్ పలగాటి శ్రీనివాసరెడ్డి వాకర్స్ వింగ్ ను ప్రారంభోత్సవం చేశారు. వాకర్స్ క్లబ్ ఏర్పడడం సంతోషం కలిగించిందని సేవా కార్యక్రమాలలో ముందుండాలని సభ్యులను ఎమ్మనుదించి వాకింగ్ మీద శ్రద్ధ కలిగించాలని మనసారా కోరుకుంటూ ఈ వెల్ వాకర్స్ వింగ్ ప్రజలకు ఉపయోగపడాలని కోరారు. డిప్యూటీ గవర్నర్ రఘురాం మురిదాజ్ మాట్లాడుతూ పేద ప్రజలను ఆదుకోవాలని వాకర్స్ క్లబ్బులు ఈ రోజు దేశంలో బాగా గుర్తింపు పొంది ప్రజలు సభ్యుల చేరడానికి ఉత్సాహపడుతున్నారని ఇంతటి ఆరోగ్యం ఇచ్చే సంస్థ స్థాపించడం మనకు ఇచ్చిన అదృష్టమని కొనియాడారు. అధ్యక్షులు భోగవరపు శ్రీమన్నారాయణ మాట్లాడుతూ పొదలకూరు రోడ్డులో మొట్టమొదటిసారిగా వాకర్స్ క్లబ్ ఏర్పాటు చేశామని ఇప్పటికే సభ్యులు ఉత్సాహం చూపించి సేవా కార్యక్రమాలు ముందుంటామని తర్వాత మంచి ఆరోగ్య విషయంపై సూచనలు చేస్తూ మెడికల్ కార్యక్రమాలు నిర్వహిస్తూ వాకర్స్ చేయూతగా ఉంటామని తెలిపారు. జిల్లా కార్యదర్శిని సన్మానించారు. సెక్రటరీగా పేటేటి వెంకయ్య, కోశాధికారిగా లక్కాకుల పెంచల నర్సింహారావు, గౌరవ సలహాదారులు డాక్టర్ గంగిశెట్టి శివకుమార్, కార్యనిర్వాహణ సభ్యులుగా ఉదయ్, నారాయణ, అర్జున్, వెంకటేశ్వర్లు, మహిళా ప్రతినిధిగా శిఖరం రాజేశ్వరి ఎంపిక చేశారు.

హెల్మెట్ తప్పనిసరి

ప్రజాశక్తి-గుడ్లూరురూరల్ : మండలంలోని ద్విచక్రవాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు. వెహికల్ కు సంబంధించిన రికార్డులు ఫోర్సులో ఉంచుకోవాలని, ఆటో డ్రైవర్లు యూనిఫాం ధరించి ఉండాలన్నారు. వెహికల్ కి సంబంధించిన ఎఫ్సీలు ,ఇన్సూరెన్స్ ,పర్మిట్, డ్రైవింగ్ లైసెన్సులు ఉంచుకోవాలన్నారు. ఆటోలు పరిమితికి మించి జనాలను ఎక్కించుకోరాదన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపకూడదన్నారు. అతివేగంగా వాహనాలు నడిపే వారికి కఠిన చర్యలు తప్పవన్నారు.

పాడిరైతుల సంక్షేమానికి చర్యలు

ప్రజాశక్తి-గుడ్లూరురూరల్ : టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పాడిరైతుల సంక్షేమాభివృద్ధి కోసం చర్యలు చేపట్టింది. మినీ గోకులం షెడ్ మంజూరుకు శ్రీకారం చుట్టింది. గ్రామాల్లో పశుపోషణ, కోళ్ల, గొర్రెలు, మేకలు పెంపకానికి మెరుగైన వసతి కల్పిస్తూ, పెంపకందార్లను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మండలానికి 21 గోకులం యూనిట్లు మంజూరు వచ్చినట్లు ఎంపీడీవో వై. వెంకటేశ్వర్లు తెలిపారు.గుడ్లూరు అమ్మవారిపాలెం పొటిరెడ్డిపల్లి తో పాటు ఆ గ్రామాలలో భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీవో ఎస్.కె అబ్దుల్లా, ఈ సి .యు విజయ్ కుమార్ గుడ్లూరు సర్పంచ్ శంకర్ రైతులతోపాటు ఎన్ఆర్ఇజిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

అవినీతిని నియంత్రించాలి

ప్రజాశక్తి-కావలి : సమాజంలో పెరుగుతున్న అవినీతి నియంత్రించి, వినీతి నిరోధక చట్టాలపై అవగాహన పెంచుకోవాలని కావలి లోక్ అదాలత్ సభ్యులు ఎం.మాలకొండారెడ్డి పేర్కొన్నారు. కేంద్ర విజిలెన్స్ కమిషన్ ఆదేశాల మేరకు భారతదేశంలో పెరుగుతున్న అవినీతిని నియంత్రించడానికి ప్రజలను చైతన్య పరిచి, మహాత్మ గాంధీ కలలు కన్న అవినీతి రహిత సమాజం కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. మండలంలోని గౌరవరం సహకారంలో ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ ఆవరణలో ఖాతాదారులకు అవినీతి నియంత్రణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కరపత్రాలను ఆవిష్కరించి, ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎపిజివి గౌరవరం బ్రాంచ్ మేనేజర్ రత్నకుమారి, ఫీల్డ్ ఆఫీసర్ ప్రవళిక, జోసెఫ్ కుమార్, కె.సాగర్, బ్యాంక్ ఉద్యోగులు పాల్గొన్నారు.

'సూర్య ఘర్'ను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-కావలి : ప్రజలకు ఉచిత విద్యుత్ అందించేందుకే ప్రధాన మంత్రి సూర్య ఘర్ ముఫత్ బిజిలీ యోజన పథకాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టాయని ఎంఎల్ఎ దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి తెలిపారు. కావలి పట్టణంలోని తుమ్మలపెంటరోడ్డులోని స్పందన ఫంక్షన్ హాల్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన "పి.ఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన" అనే పథకం ద్వారా విద్యుత్ వినియోగదారులు పొందే ప్రయోజనాలను వివరించే అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఎల్ఎ దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా అక్కడ పలు సోలార్ ఏజెన్సీ వారు ఏర్పాటు చేసిన పరికరాలను ఎంఎల్ఎ పరిశీలించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎంఎల్ఎను విద్యుత్ అధికారులు పుష్పగుచ్చాలు ఇచ్చి శాలువాలు కప్పి ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం : ప్రధాన మంత్రి సూర్య ఘర్ పథకాన్ని సద్వినియోగ పరుచుకోవాలని ఎంపిడిఓ శ్రీహరి కోరారు. బుచ్చిరెడ్డిపాలెం ఎంపిడిఓ కార్యాలయంలో సోమవారం ఈ పథకంపై సచివాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించుకుందాం..

ప్రజాశక్తి-ఉదయగిరి : స్థానికంగానే మండలంలో ప్రతి సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సమస్యలను పరిష్కరించుకుందామని ఎంపిడిఒ ఆప్యాజ్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక మండల అభివృద్ధి కార్యాలయం లో ఆయన మాట్లాడుతూ ఎంపిడిఒ, తహశీల్దార్ కార్యాలయంలో జరిగే ఈ కార్యక్రమానికి అందరూ మండల స్థాయి అధికారులు తప్పకుండా హాజరవుతారని అవసరమైన ప్రజలు సమస్యను పరిష్కార వేదికలో అర్జీ ఇవ్వాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తప్పనిసరిగా పాల్గొనాలని కోరారు.

పాఠశాలకు మొక్కలు వితరణ

ప్రజాశక్తి-బిట్రగుంట : బిట్రగుంట పేట పంచాయతీలోని జెడ్పీ పాఠశాలలో శిందాసిని ఫౌండేషన్ హాంకాంగ్ వారి సహకారంతో ఆధ్య ఉమెన్స్ అసోసియేషన్ రూరల్ డెవలప్మెంట్ స్వచ్ఛంద సేవాసంస్థ వ్యవస్థాపకురాలు గోవాల బాలాజిల ఆధ్వర్యంలో సోమవారం మొక్కలు నాటే కార్యక్రమం జెడ్పీహెచ్ఎస్ పాఠశాల బాలికల పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు గంగాధర్ రావు సమక్షంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దేవదత్త, రమణయ్య, మధు, సుహాసిని, పుష్పమ్మ వెంకటరమణయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పూడికతీత పేరుతో ఇసుక దందా

- దప్పలంపాడు చెక్ డ్యాం వద్ద బాగోతం
- ప్రభుత్వ డబ్బుతో తవ్వకాలు
-అమ్మకాలు డబ్బు ప్రయివేటుకు

ఇసుకను తీసుకెళ్తున్న ట్రాక్టర్

ప్రజాశక్తి-కందుకూరు

కందుకూరు శాసనసభ నియోజక వర్గంలో కొత్త తరహా ఇసుక దందాకు తెరలేచింది. పూడిక తొలగింపు పేరట ప్రభుత్వ డబ్బుతో ఇసుక తవ్వి అక్రమ అమ్మకాలతో సొమ్ము చేసుకుంటున్నారు. గుడ్లూరు మండలం లోని దప్పలంపాడు చెక్‌డ్యాం వద్ద మన్నేరులో ఈ సరికొత్త బాగోతం సాగుతోంది.చెక్‌డ్యాం ఎగవవైపు, దిగువవైపు ఇసుక పూడిక వుందని జలవనుల శాఖ అధికారులు గతంలోనే తేల్చారు. పూడిక తొలగింపునకు టెండర్లు పిలవాలని కూడా ఏనాడో ప్రతిపాదించారు. పాత ప్రతిపాదనలు అధికార పార్టీకి ఇప్పుడు అక్కరకు వచ్చాయి. అత్యవసరంగా కూడిక తొలగించాల్సి ఉందంటూ జల వనరుల శాఖతో సరికొత్త ప్రతిపాదనలు తయారు చేయించారు. అత్యవసర పని కాబట్టి టెండర్లు పిలవకుండానే నామినేషన్ పై కందుకూరు మండలంలోని కొండమనసు పాలెంకు చెందిన ఓ వ్యక్తి పేరట కాంట్రాక్టు ఇచ్చారు. దప్పలంపాడు చెక్ డాం ఎగువన, దిగువన కలగలిసి 3645 మెట్రిక్ టన్నుల పూడిక తొలగించాలని ఆదేశించారు. ఈ పూడిక తొలగింపు, రవాణా కోసం ఘనపు మీటరుకు సుమారు 130 రూపాయలు వంతున జలవనరుల శాఖ కాంట్రాక్టర్‌కి చెల్లిస్తుంది. కాంట్రాక్టర్ పని వాస్తవ విలువ ఎంత అనేది జలవనల శాఖ అధికారులు నోరు విప్పడం లేదు. చెక్ డాం వద్ద తవ్వాల్సిన ఇసుకను గుడ్లూరు మండలంలోని గుండ్లపాలెం వద్ద కుప్పలుగా పోసి నిలువ చేయడానికి ఆ మండల తహశీల్దారు అనుమతించారు. జలవనరుల శాఖ ఒంగోలు సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శివరామ ప్రసాద్ అనుమతుల ప్రకారం అక్టోబర్ 21 నుంచి నవంబర్ నాలుగులోగా కాంట్రాక్టర్ ఈ పని పూర్తిచేయాలి. పూడికి తీర్థ పని అయితే పది రోజుల క్రితమే మొదలు పెటారు కానీ నిబంధనలు ఎక్కడ అమలు కావడం లేదు. కేవలం 3645 మెట్రిక్ టన్నుల పూడిక తొలగించాల్సి ఉండగా అది బంగారం లాంటి ఇసుక కావడంతో ఇప్పటికే మూడు నుంచి నాలుగు రెట్లు ఎక్కువ తొలగించారు. మనుషులతోనే పూడిక తొలగించాలని జలవనరుల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శివరామ ప్రసాద్ స్పష్టంగా ఆదేశించినప్పటికీ కాంట్రాక్టర్ యదేశ్చగా జెసిబి యంత్రాలను వినియోగిం చారు. ఎరులు,వాగులు వంటి జలవనరుల లో పూడికతీతకు యంత్రాలను వినియోగించ రాదని సుప్రీంకోర్టు ఏనాడో మార్గదదర్శకాలు జారీ చేసినప్పటికీ జలవనరుల శాఖ కందుకూరు సబ్ డివిజన్ అధికారులకు అవేమీ పట్టడం లేదు. యంత్రాలను వినియోగిస్తే ఆయిల్ లీకేజీ వంటి సమస్యల వలన జలచరాల ఉనికి కి ప్రమాదం కలిగే అవకాశం ఉంది. అవి అన్ని ఒక ఎత్తు అయితే గుండ్లపాలెం వద్దకు తరలించిన పూడిక తీత ఇసుక ఎప్పటికప్పుడు మాయం అవుతుంది. అధికార పార్టీ నాయకులు కొందరు ఇసుకను రాత్రి వేళ టిప్పర్లతో మార్కాపురం పట్టణానికి తీసుకువెళ్లి అనధికారికంగా అమ్మి సొమ్ము చేసుకుంటున్నారని తెలిసింది. నిబంధనల ప్రకారం పూడికతీత వల్ల వచ్చిన ఇసుకను గనుల శాఖ విక్రయించాలి. ఈ విషయం తమకేమీ తెలియదని జలవనరుల శాఖ కందుకూరు సబ్ డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ హజరత్తయ్య, కందుకూరు సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ సీతారామయ్య ప్రజాశక్తితో అన్నారు. దప్పలంపాడు చెక్ డాం వద్ద అసలు పూడిక తీయనేలేదని సీతారామయ్య చెప్పారు. హజరత్తయ్య కూడా ముందు అలాగే ప్రజాశక్తితో ఫోన్లో చెప్పినప్పటికీ ఆ తర్వాత మళ్లీ ఫోన్ చేసి శనివారం నుంచి పూడిక తీత ప్రారంభమైందన్నారు. వాస్తవానికి గత నెల 21 నుంచి అధికారులు మార్కింగ్ సైతం ఇవ్వకుండానే అక్రమంగా పూడికతీత జరుగుతోంది. నిబంధనల ప్రకారం ఎక్కడ ఎంత కూడిక తీయాలో అసిస్టెంట్ ఇంజనీర్ మార్కింగ్ ఇవ్వాల్సి ఉంది.

ఆక్రమణ నుంచి దొరువుకు విముక్తి

- ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

మండలంలోని కోడూరు బిట్ -1 రెవెన్యూ గ్రామ పరిధిలోని సర్వే నెం 1105లో 2 ఎకరాలు 20 సెంట్ల పంచాయతీ దొరువు ఆక్రమణకు గురైన విష యం తెలిసిందే. ఈ మేరకు "దర్జాగా పంచాయతీ దొరు వు కబ్జా" అనే శీర్షికతో ప్రజాశక్తి దినపత్రికలో వార్త ప్రచు రితం అయ్యింది. ఈ వార్తకు స్పందించిన జిల్లా కలెక్టర్ ఆనంద్ పంచాయతీ దొరువు ఆక్రమణపై సంబంధిత శా ఖ అధికారులను విచారించారు. కలెక్టర్ విచారణలో పంచాయతీ దొరువు ఆక్రమణకు గురైనట్లు నిర్ధారణ అ యింది. వెంటనే ఆక్రమణ చెర నుంచి పంచాయతీ దొరువును విడిపించాలని జిల్లా కలెక్టర్ పంచాయతీ శాఖ అ ధికారులను ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పం చాయతీ కార్యదర్శి సోమవారం ఆక్రమణకు గురైన దొ రువు ప్రాంతంలో "ఇది ప్రభుత్వ భూమి (దొరువు) ఇందులో ఇతరులు ఎవరు ప్రవేశించ రాదు.. ఎటువంటి కార్యక్రమాలు చేపట్టరాదు.. ఆక్రమించినచో చట్టపరమైన చర్యలకు బాధ్యులు అగుదురు" అని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఆక్రమణ చెర నుంచి పంచాయతీ దొరువును విడిపించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

కుంగిన రోడ్డు

ప్రజాశక్తి-నెల్లూరు

నూతనంగా నిర్మిస్తున్న రోడ్డుపై టిప్పర్ వాహనం ఒక్కసారిగా కుంగిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. దాదాపు ఏడెనిమిదేళ్ళ గా నెల్లూరు - వెల్లంటి రోడ్డు సరిగా లేకపోవడంతో ప్రయాణికులు ఎన్నో ఇబ్బందులకు గురయ్యారు. స్థానిక ఎంఎల్ఎ చొరవతో ఆ రోడ్డు నిర్మాణానికి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయించి పనులు చేపడుతున్నారు. నరసింహ కొండ నుంచి కందమూరు గ్రామం వరకు సింగిల్ రోడ్డు పనులు జరుగుతున్నాయి. మరీ ముఖ్యంగా సౌత్‌మోపూరు గ్రామం నుంచి కందమూరు గ్రామం వరకు చేపడుతున్న రోడ్డు నిర్మాణం ప్రమాదకరంగా తయారైంది. ఎదురెదురుగా బస్సులు వస్తే క్రాస్ అవ్వలేని దుస్థితి వస్తుంది. అంతచిన్నగా రోడ్డు ఉంటుంది. ఆ రోడ్డుకు వచ్చే మార్జిన్ సైతం పటిష్టంగా వేయడం లేదని స్థానికులు, ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. కనీసం రోడ్డు కిందకి బైక్ దిగినా కుంగుతుందని వాహనదారులు వాపోతున్నారు. ఈ విధమైన మార్జిన ఏర్పాటు ఎప్పటికైనా ప్రమాదకరమని, అధికారులు చొరవ తీసుకొని ఆ మార్జిన్ ఏర్పాటును పటిష్టంగా నిర్మించాలని కోరుతున్నామన్నారు. ఇదే మార్జిన్ ఏర్పాటు కొనసాగితే ఎప్పటికైనా ప్రమాదాలు చోటుచేసు కునే ఘటనలు లేకపోలేదన్నారు. పూర్తిస్థాయి రోడ్డు నిర్మాణం జరిగేంత వరకూ భారీ వాహనా లైన ఇసుక లారీలు, టిప్పర్‌లను అనుమతించ నివ్వకూడదని కోరుతున్నామన్నారు. ఈ రోడ్డు నిర్మాణం మొదట్లోనే ఒక్కరోజు కురిసిన వర్షానికి ములుమూడి చెరువు వద్ద రోడ్డు కొట్టుకు పోయింది. అప్పుడు స్థానిక గ్రామాల నాయకులు ఆ చెరువు వద్ద కలుజు, వంతెనలు ఉండేలా రోడ్డు నిర్మాణం చేపట్టాలని నిరసన ధర్నాలు చేపట్టారు.

ఎంఎల్ఎ సూచనలతో బస్ ఏర్పాటు

ప్రజాశక్తి-వరికుంటపాడు

ఎర్రవరెడ్డిపల్లి, గొల్లపల్లి, విరువూరు గ్రామాల మార్గంలో ఎటువంటి బస్సు సౌకర్యం లేక స్థానికులు, విద్యార్థులు, ఇబ్బందులు పడుతున్న తరుణంలో కొంతమంది నాయకులు దృష్టికి తీసుకుపోవడంతో స్పందించిన ఎంఎల్ఎ కాకర్ల సురేష్ ఉదయగిరి డిపో మేనేజర్ శ్రీనివాస్ రావుతో మాట్లాడి ఎట్టకేలకు బస్సును ఏర్పాటు చేయించారు. మండలంలోని గొల్లపల్లి గ్రామంలో బస్సును ఆసిసిస్టెంట్ మేనేజర్ నాగబూశనం, ఎడిసి వెంకటేశ్వర్లు, టిడిపి నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ మేనేజర్ మాట్లాడుతూ విద్యార్థులకు సౌలభ్యం ఉండడంతోపాటు స్థానికులు ప్రయాణించే విధంగా బస్సులు ఏర్పాటు చేశామని ఎంఎల్ఎ సూచనలు మేరకే ఏర్పాటు చేశామన్నారు. స్థానికులు ఆటోలను ఆశ్రయించకుండా బస్సులోనే ప్రయాణించి సమస్త అభివృద్ధికి సహకరించాలన్నారు. అడిగిన వెంటనే బస్సు ఏర్పాటు అయ్యేలా చేసిన ఎంఎల్ఎకు విద్యార్థులు వారి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గంగవరపు శివరామయ్య, గంగవరపు పుల్లయ్య, చంద్ర ప్రభాకర్ రాయుడు, గంగవరపు పద్మయ్య, లిక్కయ్య, శేషు, శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

టెట్‌లో 'మెథడ్స్' విద్యార్థుల ప్రభంజనం

ప్రజాశక్తి-కావలి : జనతాపేట నార్త్, కావలిలో ఉన్న "మెథడ్స్ కోచింగ్" సెంటర్ విద్యార్థులు జులై 2024లో ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసి, అక్టోబర్‌లో ఎగ్జామ్స్ నిర్వహించి, ఫలితాలను సోమవారం విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విడుదల చేశారు. విడుదల చేసిన ఫలితాలలో "మెథడ్స్ కోచింగ్ విద్యార్థులు" అద్భుతమైన ఫలితాలను సాధించారు. ఇప్పటి వరకు అందిన సమాచారం ప్రకారం సెకండ్ గ్రేట్ టీచర్ విభాగంలో : శీలం బ్ర హ్మ రెడ్డి బి147.86/150, కె.కార్తీక్‌బి145.89,కె.దినేష్‌బి145.75,వి. మహేంద్రబి142 మార్కులు సాధించారు. స్కూల్ అసిస్టెంట్(సోషల్) విభాగంలో : ఎం.బాబుబి134 /150, జి.రేఖ బి128, వి.లక్ష్మి 123, స్కూల్ అసిస్టెంట్ (మ్యాథ్స్ గ్రూప్) విభాగంలో:-ఎం.నవ్యబి129.61/150, ఎస్.కె.కరిష్మాబి 121, జి.శ్రీహరి 118, స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లీష్) విభాగంలో:-ఎం .బాబు-114/150, వాకా శైలజ కుమారి 111.37 అనూష రేచల్‌బి111.30, మంగళ గిరి వాసవిబి109.23,స్కూల్ అసిస్టెంట్ (తెలుగు):- పులిమి శ్రీ తేజబి115, నాగ జ్యోతి బి102, జి రేఖబి101,ఇంతటి ఘన విజయం సాధించిన విద్యార్థులకు మెథడ్స్ కోచింగ్ సెంటర్ కరెస్పాండంట్ కె.శ్రీ లక్ష్మి ప్రత్యేక అభినందనలు, ఘన విజయానికి కారకులైన ఉపాధ్యాయులుకు అభినందనలు తెలియజేశారు.

రీ సర్వేతో లబ్ధిదారులకు అవస్థలు

తహశీల్దారుకు సమస్యలను వివరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-ఉదయగిరి

మండలంలో ప్రభుత్వం చేపట్టిన రీసర్వేను అడ్డు పెట్టుకొని భూ అక్రమదారులు నిజమైన భూ లబ్ధిదారులకు ఇబ్బందులు గురి చేస్తున్నారని రైతు సంఘం నాయకులు కాకు వెంకటయ్య ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆయన పలు సమస్యలపై అర్జీలను తహశీల్దార్ సుభద్రకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులకు గత ప్రభుత్వం 6 విడతలుగా భూ పంపిణీ చేసిందని ఆ భూములను కూలి చేసిన డబ్బులతో చెట్టు పుట్టను చదును చేసుకొన్నారని రైతు భరోసా పిఎం కిసాన్ అన్ని రకాల ప్రభుత్వ రైతు సంక్షేమ పథకాలను పొందుతున్నారన్నారు. కానీ భూ పంపిణీ కార్యక్రమంలో జరిగిన తర్వాత వచ్చిన నూతన ప్రభుత్వాలు పాలకులు కొత్తగా భూ పంపిణీ జరపకపోగా అర్హులైన పేద ముస్లిం, మైనార్టీలకు ఇచ్చిన భూములు రద్దు చేయాలని కుట్రలో భాగంగా అనేక రకాలుగా వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆయన తెలిపారు. వారికి నోషనల్ ఖాతాలు లేకపోవడంతో 1- బి అడంగల్ రాకపోవడంతో అర్హులైన వారు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఈ విషయంపై మండల కేంద్రంలో అనేక ఆందోళనలు ప్రజలు రైతు సంఘాలతో చేశామని జిల్లా ఉన్నత అధికారులకు దృష్టికి తీసుకువెళ్లామన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అర్హులైన పేద ముస్లిం మైనార్టీలకు అర్హులైన భూములను కలవారికి వారికి అందేలా చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిటిసి కాకు విజయ, తిరుపతయ్య, వెంకట సుబ్బయ్య, లబ్ధిదారులు, రైతులు పాల్గొన్నారు.

భూసమస్యలను పరిష్కరించాలి

వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-మర్రిపాడు

జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యులు శేషం.సుదర్శన్ ఇన్‌ఛార్జి తహశీల్దార్ అనిల్‌కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పలు మండలంలోని సమస్యల గురించి చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని గ్రామ పంచాయతీల్లో పెండింగ్‌లో ఉన్న చిన్న, సన్నకారు రైతులు, పేదల భూములకు సంబంధించిన రికార్డుల విషయంలో ఉన్న అవకతవకలు పరిష్కరించాలని కోరారు. ప్రతినెలా చివరి వారంలో మండలంలోని ఒక గ్రామ పంచాయతీలో పౌరహక్కుల దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజలకు వారి హక్కులపై అవగాహన కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. మండల పరిధిలో అక్రమ మద్యం అమ్మకాలు ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతున్నాయని వాటిని అరికట్టాలని, ప్రత్యేకంగా మహిళలకు సంబంధిం చిన విషయాల్లో ప్రతీ గ్రామ సచివాలయ పరిధిలోనీ మహిళా పోలీస్ ద్వారా గ్రామంలో మహిళలకు సంబంధించిన చట్టాలు వంటి అంశాల గురించి అవగాహన కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలపై లబ్ధిదారులకు ఆయా సచివాలయాల్లో అవగాహన కల్పించేలా సంబధిత అధికారులు పనిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

సాగునీరు విడుదల

నీరు విడుదల చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-జలదంకి

కావలి కాలువ పరిధిలోని బ్రాహ్మణక్రాక మేజర్‌కు సోమవారం టిడిపి నాయకులు పూనూరు రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో, మర్రిమాను చెరువు ఆయకట్టు ప్రెసిడెంట్ మారెళ్ళ వెంకటరామిరెడ్డి అధ్యక్షతన సాగునీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఉదయగిరి ఎంఎల్ఎ కాకర్ల సురేష్ ఆదేశాలతో ఎన్‌డిఎ కూటమి నాయకులతో కలిసి బ్రాహ్మణ కాక మేజర్‌కు సాగునీటిని విడుదల చేశామన్నారు. హాయ్ కట్టు పరిధిలోని ప్రతి ఎకరాకు సాగునీటిని అందిస్తామని రైతన్నలకు హామీనిచ్చారు. గంగమ్మ తల్లికి జలహారతి ఇచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జలదంకి మండలం మాజీ వైస్ ఎంపిపి తల్లపనేని మధుసూదన్ రావు మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు అయిందని, ఇప్పటికే సూపర్ సిక్స్ పథకాలలో కొన్నింటిని అమలు చేశామన్నారు. ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమలు చేస్తారన్నారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయితే వర్షాలు సరిగా పడవని వైసిపి నాయకులు రైతులలో ప్రజలలో అపోహలు కలిగిస్తున్నారని, ఇటీవల కురిసిన వర్షాలకు రాష్ట్రంలోని ప్రాజెక్టులన్ని నిండు కుండలా తయారయ్యాయన్నారు. ఇప్పటికైనా వైసిపి నేతలు అభివృద్ధికి సహకరిస్తే ప్రజలు హర్షిస్తారన్నారు. స్వర్ణ కొండప నాయుడు, కొల్లా రాధాకృష్ణ, బిజెపి యువమోర్చా స్టేట్ కోకన్వీనర్ హనుమారెడ్డి, జనసేన నాయకులు నిమ్మలపల్లి రామ్‌చైతన్య, కొర్రపాటి రామారావు, తోట మురళి, మారెళ్ళ కోటారెడ్డి, ఆలూరు లోకేష్ రెడ్డి, వేల్పుల మధు, శెట్టిపల్లి మహేశ్వరరావు, దేవరపల్లి రమేష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-వరికుంటపాడు : డబ్బులు ఇవ్వలేదని తల్లిపై అలిగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల మేరకు.. మా డౌన్లోడింగ్ భోగివారిపల్లిలో పూజల వెంకటేశ్వర్లు(27) అనే యువకుడు అయ్యప్ప స్వామి మాల వేసుకునేందుకు తల్లిని డిమాండ్ చేశాడు. ఆమె తన వద్ద డబ్బులు లేవని ఇవ్వకపోవడంతో ఆవేశానికి లోనైన వెంకటేష్ ఇంట్లోకి వెళ్లి ఫ్యానుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వెంటనే గమనించిన తల్లి ఇరుగుపొరుగు వారిని పిలిచి చికిత్స నిమిత్తం ప్రకాశం జిల్లా పామూరుకు తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపినట్టు సానికులు తెలిపారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

దుకాణంలో పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-మర్రిపాడు

మండలం లోని ఎరువులు పురుగు మందులు, విత్తనాలు డీలర్ల షాపులను ఇంటర్నల్ స్క్వాడ్‌లో భాగంగా వింజమూరు సహాయ వ్యవ సాయ సంచాలకులు ఎన్.రామిరెడ్డి తనిఖీలు నిర్వహించారు. ఎరువులు పురుగుమందులు, విత్తనాలు స్టాక్ నిల్వలను పరిశీలించారు. ఇన్వాయిస్ స్టాక్ రిజిస్టర్ బిల్ బుక్స్‌ను పరిశీలించారు. డీలర్లు స్టాక్ అమ్మిన వెంటనే తప్పనిసరిగా బిల్లులను రైతులకు ఇవ్వాలని ఆదేశించారు. అధిక ధరలకు విక్రయిస్తే డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాపర్ ఆక్సి క్లోరైడ్ (బ్లైటాక్స్) ప్యాకెట్స్ ప్రిన్సిపల్ సర్టిఫికెట్ లేనందు వల్ల 37పాకెట్స్ ఒక్క ప్యాకెట్ 500 గ్రాములు రూ.14800 విలువచేసే అమ్మకాలను ధనలక్ష్మి సీడ్స్ అండ్ పెష్టిసైడ్స్ షాప్‌లో నిలిపివేశారు. వీరివెంట ఉదయగిరి సహాయ వ్యవసాయ సంచాలకులు పి.చెన్నారెడ్డి స్థానిక మండల వ్యవసాయ అధికారి ఎస్.రామ్మోహన్, ఉదయగిరి వ్యవసాయ అధికారి ఆంజనేయులు నాయక్ పాల్గొన్నారు.

పంట యాజమాన్యంపై శిక్షణ

ప్రజాశక్తి-మర్రిపాడు

మాట్లాడుతున్న పి.సత్యవాణి

ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ప్రతినిధులకు సమగ్ర పోషక యాజమాన్యంపై, సమేతి, మేనేజ్ సంయుక్త ఆధ్వర్యంలో 15రోజుల శిక్షణను సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా జిల్లా వ్యవసాయ అధికారి పి.సత్యవాణి పాల్గొని మాట్లాడుతూ భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువులు వాడుకుంటే అధిక దిగుబడులు సాధించి ఖర్చులు తగ్గించుకోవచ్చని తెలియజేశారు. సేంద్రియ ఎరువులు వాడనందున మన పొలంలోని నేల జీవం కోల్పోయి క్రమేణా పంట ఉత్పాదక శక్తి క్షీణిస్తుందని, క్రమేపీ రసాయనిక ఎరువుల మోతాదు పెంచాల్సి వస్తుందని, కాలక్రమేణా, సూక్ష్మపోషకాల లోపాలు అధికమవుతాయని, దాంతో దిగుబడి తగ్గి ఖర్చు అధికమవుతుందన్నారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం, నెల్లూరు సమన్వయకర్త డాక్టర్ జి.లలితశివ జ్యోతి మాట్లాడుతూ నేల సారవంతం తగ్గడానికి గల కారణాలు, నేల ఆరోగ్య పరిరక్షణకు పాటించాల్సిన పద్ధతుల గురించి తెలిపారు. సమగ్ర పోషక యాజమాన్య పద్ధతులు పాటిస్తూ భూసారాన్ని కాపాడాలని సూచించారు. జీవన ఎరువులు వాడుకొని రసాయన ఎరువుల మోతాదు 25శాతం వరకు తగ్గించుకోవాలని వివరించారు. సమగ్ర పోషక యాజమాన్యంలో భాగంగా సూక్ష్మ పోషకాల ప్రాముఖ్యతను వివరిస్తూ రసాయన ఎరువుల వాడకం వల్ల జరిగే అనర్థాలను వివరించారు. మొదటి రోజు శిక్షణా కార్యక్రమంలో బాగంగా ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ప్రతినిధులకు నేల రకాలు, మొక్కలకు కావాల్సిన పోషకాలు వాటి ప్రాముఖ్యత, ఎరువుల రకాలు వాటి వాడకం అనే అంశాలపై కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేతలు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా కోప్‌అధికారి గురప్ప, శాస్త్రవేత్త కిరణ్ కుమార్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఇష్టానుసారంగా కాలువల నిర్మాణం

ప్రజాశక్తి-వింజమూరు : వింజమూరులోని మురుగు కాలువ నిర్మాణాలు కాసులకు కక్కుర్తి పడి ఇష్టాను సారంగా నిర్మితమవుతున్నట్లు స్థానిక మాజీ సొసైటీ చైర్మన్ జూపల్లి రాజారావు ఆరోపిస్తున్నారు. వింజమూరు లోని స్టేట్ బ్యాంక్ వెనుక వైపున నూతన నిర్మాణం జరు గుతున్న భవన దగ్గర మురుగు కాలువ భవన యజమా నులకు అనుకూలంగా నిర్మాణమైనట్లు దాంతో పంచా యతీ నిధులు దుర్వినియోగం అయ్యాయన్నారు. పట్టణంలో పలుచోట్ల ఇదే విధంగా కాలువలో నిర్మాణం జరిగాయని తెలిపారు. గంగమెట్టలోని ప్రధాన మురుగు కాలువ వద్ద కల్వర్టు కట్టగా దానికి సరిపడే పరిమాణంలో తూములు ఏర్పాటు చేయలేదని దానివల్ల వర్షపు నీరు మురుగునీరు చేరి వెళ్లేందుకు సరిగా లేనందున అక్కడే నిలిచిపోయి దోమలు వృద్ధి చెందే అవకాశం ఉందని, దానివల్ల అనారోగ్య పరిస్థితులు ఏర్పడతాయని తెలిపారు. పంచాయతీ నిధులను వినియోగించేటప్పుడు ప్రజా సౌకర్యం కోసమే వాడాలని తన స్వార్థం కోసం వాడుకోకూడదని ఆయన తెలిపారు.

ఈ విషయంపై సర్పంచిని వివరణ కోరగా ప్రతి పని కూడా అధికారుల ఆధ్వర్యంలోనే జరిగిందని తాము స్వతహాగా చేసిన దాఖలాలు ఎక్కడా లేవన్నారు కానీ ఇంతవరకు చేసిన పనులకు బిల్లులు కూడా రాని సందర్భాలు ఉన్నాయన్నారు. కొందరు నాయకులు ఉద్దేశపూర్వకంగా ఆరోపణలు చేస్తూ కొద్దిరోజులుగా మనశాంతి లేకుండా ఆరోపణలు చేయడం తగదన్నారు.

పోలీస్‌స్టేషన్ ఎదుట మురుగునిల్వ

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : ఎఎస్‌పేట పోలీస్ స్టేషన్ దగ్గరలో గత కొంతకాలం నుంచి మురుగు నీరు నిల్వ ఉండి, దుర్వాసన వెదజల్లుతోంది. అటువైపు ఎక్కువగా గండువారిపల్లి గ్రామస్తులు, తహశీల్దార్ కార్యాలయం, మండల అభివృద్ధి కార్యాలయం, వెలుగు, కార్యాలయానికి ఎక్కువగా జనసంచారం జరుగుతూ ఉంటుంది. ముఖ్యంగా పోలీస్ స్టేషన్ పరిధిలోని క్వార్టర్స్‌లో నివాసముంటున్న పోలీస్ సిబ్బందికి ఎక్కువగా దోమల బెడద ఉంటుందని వారు తెలియజేశారు. ఇటీవల జరిగిన ఇది మన మంచి ప్రభుత్వం 100 రోజుల పరిపాలన అనే కార్యక్రమాల్లో గతంలో ఇక్కడ పనిచేసి బదిలీపై వెళ్లిన ఎస్ఐ ప్రసాద్‌రెడ్డి తెలియజేశారు. కానీ ఇంతవరకు ఆ నిల్వ ఉన్న మురుగు నీటిని, సత్వరమే తొలగించి దోమల బెడద నుంచి తప్పించాలని, పంచాయతీ వారిని, ఉన్నత అధికారులను గ్రామస్తులు పోలీస్ సిబ్బంది తదితరులు కోరారు.

విద్యుత్ స్తంభాలు ఏర్పాటు

ప్రజాశక్తి-బిట్రగుంట

బోగోలు మండల కేంద్రం బేతానియపేటలో విద్యుత్ స్తంభాలు, తీగల మరమ్మతులు నిర్వహించారు. ఎన్నో సంవత్సరాలుగా విద్యుత్ స్తంభాలు విరిగిపోయి, పలుమార్లు తీగలు తెగిపోయి విద్యుత్ అంతరాయం ఏర్పడుతూ ఉండేది. స్థానిక టిడిపి నాయకులు సంజయ్ ప్రోద్భలంతో కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి సహకారంతో విద్యుత్ స్తంభాలు, విద్యుత్ తీగలను విద్యుత్ శాఖ సిబ్బంది సోమవారం అమర్చారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. మాజీ ఎంపిటిసి, సీనియర్ టిడిపి నాయకులు చిలకపాటి వెంకటేశ్వర్లు, పులివెందుల వినోద్, వైఫిలో మెన్, బంక ఫిలిప్, గోసాల విజయ్, వై.అనిల్, గ్రామస్తులున్నారు.

కార్పొరేటర్లతో ఎంఎల్‌సి సమావేశం

ప్రజాశక్తి-నెల్లూరు

నెల్లూరు రాంజీ నగర్‌లోని తన కార్యాలయంలో కార్పొరేటర్లు వేలూరు ఉమా మహేష్, ఊటుకూరు నాగార్జున, కామాక్షి దేవి, కరిముల్లా, జయలక్ష్మి, నీలి రాఘవరావు, నేతాజీ సుబ్బారెడ్డిలతో వైసిపి నెల్లూరు నగర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ఎంఎల్‌సి పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి సమావేశం నిర్వహించారు. రేపటి మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం గురించి చర్చించారు. ఆయా ప్రాంతాల్లో ప్రజలకు ఏ కష్టం వచ్చినా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని తెలియజేసేలా కార్యక్రమాలు సాగించాలన్నారు.

ప్రత్యేక బస్ సర్వీసు ఏర్పాటు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

పవిత్ర కార్తీక మాస పౌర్ణమిని పురస్కరించుకుని ఆత్మకూరు నుండి అరుణాచలంకు ప్రత్యేక సర్వీసు నడుపుస్తున్నట్లు ఆర్‌టిసి డిఎం కరీమున్నిసా తెలిపారు. నవంబర్ 14వ తేదీ ఆత్మకూరు నుండి ప్రత్యేక సూపర్ లగర్జీ సర్వీసు ఏర్పాటు చేశామన్నారు. టికెట్ ధర రాను పోను రూ.1400లుగా నిర్ణయించామని, ఈ అవకాశాన్ని అరుణాచలంకు వెళ్లే ప్రయాణీకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కాణిపాకం, సిరిపురం, గోల్డెన్ టెంపుల్, అరుణాచలం, గిరి ప్రదర్శనం, దర్శనం సందర్శించే ప్రదేశాలను పూర్తి వివరాల కోసం ఫోన్ 99592 25645, 7382924753, 8555929504 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

సాగరం చెరువుకు నీరు విడుదల

ప్రజాశక్తి-అనంతసాగరం

మండలంలోని సోమశిల ఉత్తర కాలవ నుంచి సోమవారం అనంతసాగరం చెరువుకు టిడిపి నాయకులు చల్లా శివారెడ్డి ఆధ్వర్యంలో నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా చల్లా శివారెడ్డి మాట్లాడుతూ సోమశిల ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బొమ్మిరెడ్డి దశరథరామిరెడ్డి సాగరం చెరువుకు నీటి విడుదల కోరగా వెంటనే ఆయన స్పందించి ఉన్నతాధికార ఆదేశాల మేరకు నీటిని 50 క్యూసెక్కులను సాగరం చెరువుకు విడుదల చేశారన్నారు. కేత శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

నాణ్యతను తప్పక పాటించాలి

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం

మున్సిపల్ భవన నిర్మాణానికి నాణ్యతను తప్పక పాటించాలని పనులు వేగవంతం చేయాలని కాంట్రాక్టర్‌ను కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి ఆదేశించారు. బుచ్చిరెడ్డిపాలెం పట్టణంలో పాత మున్సిపల్ భవన నిర్మాణ పనులను సోమవారం కమిషనర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ భవనానికి వాడే పరికరాలు నాణ్యతను కలిగి ఉండాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. నాణ్యతలో ఎటువంటి లోపాలు ఉన్న కాంట్రాక్టర్‌కు బిల్లులను ఆపివేయడం జరుగుతుందని ఆయన వెల్లడించారు. నిబంధనల మేరకు నిర్మాణంలో నాణ్యత కలిగి ఉంటేనే బిల్లులలో ఎలాంటి కోతలు లేకుండా అందిస్తామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణంలో తేడాలుంటే చర్యలు తప్పవని కాంట్రాక్టర్‌నుకమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి హెచ్చరించారు. కార్యక్రమంలో సచివాలయాల సర్వేయర్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

దర్గాలో అన్నదానం

ప్రజాశక్తి-ఉదయగిరి : పట్టణంలోని కోనకాలువ సమీపంలో వెలసి ఉన్న మహబూబ్ సుబహాని దర్గాలో సోమవారం తహలీల్ ఫతేహ చదివింపులు కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు అన్నదాన ఏర్పాటు చేశారు. ఎంపిటిసిలు షేక్.పెద్ద మస్తానీ ఎస్దానీ, గొల్లపల్లి తిరుపతి, ఉప సర్పంచ్ షేక్ ముర్తుజా హుస్సేన్ వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ గడియాల్చి యస్థాన్, మండల కన్వీనర్ గానుపెంట ఓబుల్‌రెడ్డి నాయకులు గానుగపెంట శ్రీనివాసులరెడ్డి, షేక్.మహబూబ్ బాషా, లాడెన్ గడియాల్చి కరీం, షేక్.ఖాన్‌సా పాల్గొన్నారు.